క్లుప్తంగా

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించేలా ప్రోత్సహించాలి



విజేతలైన విద్యార్థులతో రిటైర్డు ఉపాధ్యాయులు, పాఠశాల నిర్వాహకులు

కోదాడరూరల్ : విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సంస్కృతిక కార్యక్రమాల్లోనూ రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రావెళ్ల సీతారామయ్య అన్నారు. కోదాడ పట్టణంలోని కొమరబండలో గల తేజ పాఠశాల విద్యార్థులు ఈ విద్యా సంవత్సరంలో వివిధ పోటీల్లో గెలుపొందిన బహుమతులను శనివారం ఆయన వారికి అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు బొల్లు రాంబాబు, పాఠశాల డైరెక్టర్ సోమిరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వేణుగోపాలరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రామాలయ ప్రతిష్ఠాపనోత్సవ కరపత్రం ఆవిష్కరణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న రామాలయ కమిటీ సభ్యులు

నేరేడుచర్ల : పట్టణంలో దాతల సహకారంతో రూ. 4 కోట్ల వ్యయంతో నిర్మించిన శ్రీకోదండ రామాలయ ప్రతిష్ఠాపనోత్సవ కరపత్రాన్ని ఆలయ కమిటీ సభ్యులు శనివారం ఆవిష్కరించారు. ఈ నెల 19, 20, 21 తేదీల్లో ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రాచకొండ రామచందర్‌రావు, కొణతం సత్యనారాయణరెడ్డి, రాచకొండ రాంమోహన్‌రావు, నాగండ్ల శ్రీధర్, గోపాల్‌రెడ్డి, యడవల్లి వెంకట్‌రెడ్డి, రమణారావు, కృపాకర్‌రావు, రమేష్, సుధాకర్, స్వామి, రమణారెడ్డి, రాంరెడ్డి, భాస్కర్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన సైదానాయక్



సైదానాయక్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

గరిడేపల్లి : మండలంలోని గారకుంటతండా గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ ఎస్టీ సెల్ నియోజకవర్గ నాయకుడు, గరిడేపల్లి మాజీ సర్పంచ్ బాణోతు మంగతిసైదానాయక్ శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు త్రిపురం అంజన్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పైడిమర్రి రంగనాథ్, ఎంపీపీ పెండెం సుజాతాశ్రీనివాస్‌గౌడ్‌లు ఆయనకు పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ బండ నర్సిరెడ్డి, మల్లారెడ్డి, రమేష్‌నాయక్, సురభి సైదులు, వెంకట్‌రెడ్డి, రవీందర్, జలేందర్, దశరథనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన

కోదాడరూరల్ : రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని సిరి ఫౌండేషన్ చైర్మన్ మొలుగూరి గోపి అన్నారు. శనివారం మండలంలోని మంగళితండాలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు ఆయన అవగాహన కల్పించి మాట్లాడారు. పంటలకు రసాయనిక ఎరువులను అధికంగా వాడటంతో భూసారం తగ్గి భవిష్యత్ తరాలకు నాణ్యమైన నేల లేకుండా పోతుందన్నారు. రసాయన ఎరువులు పిచికారీ చేసిను పంటలను ఆహారంగా తీసుకోవడంతో అనేక దీర్ఘకాలిక వ్యాధులు వస్తున్నాయని తెలిపారు. గోమూత్రం, పేడ, ఘన జీవామృతం, వేపగింజల కషాయం, ఆకుల కషాయాలతో మందులను తయారు చేసుకొని వ్యవసాయం చేసి ఆరోగ్యకరమైన పంటలను పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో రైతులు బాలు, వెంకటేశ్వర్లు, సైదా తదితరులు ఉన్నారు.

పశుగ్రాసం అందజేత



పశుగ్రాసం అందజేస్తున్న గుర్వయ్య

గరిడేపల్లి : మట్టపల్లిలోని లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ఉన్న గోమాతలకు గరిడేపల్లి మండలంలోని గడ్డిపల్లి గ్రామానికి చెందిన కుక్కునూరి గుర్వయ్య- గంగమ్మ దంపతులు ట్రాక్టర్ గడ్డిని (పశుగ్రాసం) శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కొంపెల్లి కృష్ణశాస్త్రి, పుట్ట బక్కయ్య, సలిగంటి వెంకటేశ్వర్లు, నవీన్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆగిన మత్స్య సొసైటీ ఎన్నికలు

- హైకోర్టు ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా తయారు
- సంఘంలోని సభ్యత్వాల సవరణపై గ్రామంలో వివాదం
- నిలిచిపోయిన ఎన్నికలు



నారాయణపురం చెరువు (ఫైల్)

చిలుకూరు : మండలంలోని నారాయణపురం ఊర చెరువు మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలు ఆగిపోయాయి. నిబంధనల ప్రకారం గత నెల ఎన్నికలు నిర్వహించేందుకు మత్స్య శాఖ అధికారులు షెడ్యూల్ విడుదల చేశారు. కానీ నామినేషన్ స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కాగానే.. సభ్యత్వాల విషయమై ఓ వర్గం తమ సభ్యత్వాలు అకారణంగా తొలగించారని, సభ్యత్వాలు విషయం తేల్చేదాక ఎన్నికలు నిర్వహించొద్దని మరో వర్గంతో వాగ్వాదానికి దిగడంతో ఎన్నికలు నిలిచిపోయాయి.

సభ్యత్వాల కోసం ఎదురుచూపు..

కాగా, నారాయణపురం గ్రామ శివారులో సర్వే నంబర్ 806 లో ఊర చెరువు సుమారు 180 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఈ చెరువు కింద నారాయణపురం, చిలుకూరు, పాలెఅన్నారం గ్రామాలకు చెందిన మొత్తం 239 మంది మత్స్య సొసైటీ సభ్యులుగా ఉన్నారు. వీరిలో ఇప్పటివరకు సుమారుగా 150 మంది మృతి చెందారు. కాగా, సంఘంలో సభ్యత్వాల కోసం ముదిరాజ్‌లు ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారు. అయితే సంఘంలో వచ్చిన లాభాలు, చేపలను మాత్రం వాటాలుగా మృతుల కుటుంబసభ్యులకు ఇస్తున్నారని.. కానీ సభ్యత్వాలు ఇవ్వడం లేదని ముదిరాజ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హైకోర్టు ఆదేశాలతో జాబితా..

అయితే సంఘంలో గల 239 మంది సభ్యులు ఉండగా వాటిలో సుమారు 150 మందికిపైగా నకిలీ సభ్యత్వాలను అక్రమంగా జాబితాలో చేర్చారని, వాటిపై విచారణ జరపాలని, ప్రభుత్వ జీఓ ప్రకారం సంఘంలో ముదిరాజ్‌లు మాత్రమే ఉండాలని వారు హైకోర్టుకు ఆశ్రయించారు. దీంతో సభ్యత్వాలపై విచారణ చేసి అర్హత కలిగిన వారికి మాత్రమే సభ్యత్వం ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. దీంతో అధికారులు విచారణ జరిపి నకిలీ ఓటర్లను తొలగించి 68 మందితో తుది జాబితా తయారు చేశారు. ఆ జాబితా ప్రకారమే ఎన్నిక నిర్వహించేందుకు అధికారులు సిద్ధం అయ్యారు. కానీ కేవలం అర్హత కలిగిన వారికి మాత్రమే ఓటర్ల జాబితాలో ఓట్లు కేటాయించాలని, వాటిలో ముదిరాజ్‌లను మాత్రమే చేర్చాలని ఒక వర్గం వారు పట్టుబడుతున్నారు. మరో వర్గానికి చెందిన వారు మాత్రం గతంలో మాదిరిగా అన్ని కులాల వారికి సభ్యత్వాలు ఉన్నాయని గత జాబితా ఆధారంగా చనిపోయిన వారి స్థానంలో వారి కుటుంబ సభ్యులనే చేర్చాలని వారు అంటున్నారు. రెండు వర్గాల మధ్య వివాదం కారణంతో మార్చి 14వ తేదీ జరగాల్సిన ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయింది.

కొత్త సభ్యత్వాలు ఇవ్వాలి



ఊరచెరువు మత్స్య సొసైటీలో నాకు నేటికీ సభ్యత్వం ఇవ్వలేదు. సభ్యత్వం కావాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా ఎలాంటి ప్రయోజనం లేదు. ప్రభుత్వం నిర్వహించిన స్కిల్ టెస్టులో కూడా పాస్ అయ్యాను అయినా సభ్యత్వం ఇవ్వలేదు. హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం ప్రస్తుతం ఉన్న 68 మందితో ఎన్నికలు నిర్వహించి అనంతరం కొత్త పాలక వర్గ సభ్యులు తమకు సభ్యత్వం కేటాయించాలి.

– తమ్మనబోయిన శంకర్, మాజీ సర్పంచ్, నారాయణపురం

ఎన్నికల విధులపై అప్రమత్తత అవసరం

- ఆర్డీఓ శ్రీనివాసులు



మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసులు

హుజూర్‌నగర్ : ఉద్యోగులు ఎన్నికల విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆర్డీఓ శ్రీనివాసులు అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా శనివారం హుజూర్‌నగర్‌లోని వీవీఎం స్కూల్‌లో పోలింగ్ సిబ్బందికి మొదటి విడత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమకు కేటాయించిన ఎన్నికల విధులకు తప్పనిసరిగా హాజరు కావాలని చెప్పారు. గైర్హాజరు అయిన వారిపై ఎన్నికల నియమావళి ప్రకారం చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో రిసోర్సు పర్సన్లు, తహసీల్దార్లు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

నీటి సమస్య తలెత్తకుండా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మల్లెల రాణి

కోదాడరూరల్ : గ్రామాల్లో వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ మల్లెల రాణి, జెడ్పీటీసీ మందలపు కృష్ణకుమారిలు అధికారులను ఆదేశించారు. శనివారం కోదాడ మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడారు. మండలంలోని గ్రామాల్లో నీటి వసతులు కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకోవాలని అధికారులకు వారు సూచించారు. ప్రజలు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని కోరారు. అనంతరం కోదాడ పీఏసీఎస్ చైర్మన్ ఓరుగంటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం పాలేరు రిజర్వాయర్‌కు విడుదలవుతున్న సాగర్ నీటితో చెరువులు నింపేందుకు అధికారులు చొరవ చూపాలని కోరారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు వారి ఎజెండాలను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లిక్కి గుర్వమ్మ, ఎంపీడీఓ రామచందర్‌రావు, ఎంపీఓ పాండురంగన్న, పీఆర్ ఏఈ రాము, ఏఓ రజిని, పశువైద్యాధికారి నాగేంద్రబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవి తదితరులు పాల్గొన్నారు.

200 రోజుల 'ఉపాధి' కల్పించాలి



కార్మిక సంఘం సభ్యత్వం అందజేస్తున్న నాయకులు

హుజూర్‌నగర్‌రూరల్ : జిల్లా వ్యాప్తంగా కరువు పరిస్థితులు ఉన్నందున ప్రభుత్వం ఉపాధి హామీ కూలీలకు 200 రోజుల పని దినాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు కోరారు. శనివారం మండలంలోని అమరవరంలో వ్యవసాయ కార్మిక సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. హుజూర్‌నగర్ ప్రాంత ప్రజలు తాగు నీటి కోసం ఇబ్బందులు పడుతుంటే వారిని పట్టించుకోకుండా సాగర్ జలాలను ఖమ్మం జిల్లాకు తరలించడం సరైన పద్ధతి కాదని అన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఆయకట్టు పరిధిలోని చెరువులు, కుంటలను నింపి తాగునీటి ఎద్దడిని నివారించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను, ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సిరికొండ శ్రీను, పోషణబోయిన హుస్సేన్, కాశీం, సైదా, రైతులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలు పరిశీలన



అల్లీపురంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ, ఎంపీఓ

మఠంపల్లి : మఠంపల్లితో పాటు అల్లీపురం, బక్కమంతులగూడెం తదితర గ్రామాలల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఎన్నికల పోలింగ్ కేంద్రాలను శనివారం ఎంపీడీఓ జానకిరాములు.. ఎంపీఓ ఆంజనేయులుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. అనంతరం సుల్తాన్‌పూర్‌తండాలో నర్సరీని పరిశీలించారు. మొక్కలు ఏపుగా పెరిగేలా నీరు పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఎం.వెంకటేశ్వర్లు, నరేందర్‌రెడ్డి, పంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

బీజేపీని బూత్ స్థాయిలో బలోపేతం చేయాలి



హుజూర్‌నగర్ : బీజేపీ జెండా ఆవిష్కరిస్తున్న అసెంబ్లీ కన్వీనర్ అంబళ్ల నరేష్



మునగాలలో..

హుజూర్‌నగర్ : భారతీయ జనతా పార్టీని బూత్ స్థాయిలో మరింత బలోపేతం చేయాలని ఆ పార్టీ అసెంబ్లీ కన్వీనర్ అంబళ్ల నరేష్‌గౌడ్ అన్నారు. శనివారం హుజూర్‌నగర్ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ఇంటి రవి అధ్యక్షతన బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని కోరారు. అనంతరం బూత్ స్వశక్తి కరణ్ అభియాన్‌లో భాగంగా 205 బూత్‌లో టిఫిన్ బైటక్ నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు ఉమామహేశ్వరరావు, డి.రామరాజు, గుండ గోపి, నకిరేకంటి రాంబాబు, కొల్లోజు నాగేంద్రచారి, సోమరాజు, డి.మురళి, యుగేందర్, చారి, రామకృష్ణ, పుల్టైమర్ కార్తీక్ పాల్గొన్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

మునగాల : మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం మండల అధ్యక్షుడు భద్రంరాజు కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా టిఫిన్ బైటక్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం నేలమర్రి గ్రామానికి చెందిన చిలకమర్రి గోవిందాచారిని మండల పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా నాయకులు బండారు కవిత అమరేందర్‌రెడ్డి, కోదాడ అసెంబ్లీ కన్వీనర్ కనగాల నారాయణ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు వెలివేల చిట్టయ్య, వీరబాబు, గోవిందాచారి, కాసాల శ్రీను, గోపి, సైదులు కె.వీరబాబు పాల్గొన్నారు.

జనమైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

గరిడేపల్లి : మండలంలోని గారకుంటతండా గ్రామంలో పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీలకు ఎండ నుంచి ఉపశమనం కోసం శనివారం జనమైత్రి ఫౌండేషన్ సభ్యులు గుగులోతు నరేందర్‌నాయక్, మహ్మద్ షరీఫ్‌లు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, కార్యదర్శి పాల్వాయి రమ్య, వెంకట్రాంనాయక్, బాలునాయక్, లకుపతినాయక్, రాజు, శ్రీను, దీప్లానాయక్, జానకిరామ్‌రెడ్డి, లక్ష్మి, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనది



రాధాదుర్గ దంపతులను సన్మానిస్తున్న కాంప్లెక్స్ హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

హుజూర్‌నగర్ : ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని కాంప్లెక్స్ హెచ్‌ఎం బీరెల్లి శ్రీనివాసరెడ్డి అన్నారు. హుజూర్‌నగర్ పట్టణంలోని జిల్లా పరిషత్ (క్యాంప్) ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు శంభుని రాధాదుర్గ పదవీ విరమణ సన్మాన కార్యక్రమాన్ని శనివారం పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయిరాలు రాధాదుర్గ గత 34 ఏళ్లుగా ఎంతో మంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దారని అన్నారు. అనంతరం రాధాదుర్గ దంపతులను ఉపాధ్యాయులు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు నలబోలు శ్రీనివాసరెడ్డి, లతీఫ్, జయవాణి, అత్తిలి వెంకటేశ్వర్లు, బొల్లా వెంకటేశ్వర్లు, రిటైర్డు ఎంఈఓ దేవదానం, అప్పయ్య, లలిత, రంగారావు, పి.శ్రీనివాస్, రిటైర్డు హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎకరాకు రూ.25 వేల నష్టపరిహారం ఇవ్వాలి



హుజూర్‌నగర్ : రైతు దీక్షలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ పక్కన కంచర్ల కృష్ణారెడ్డి, నాయకులు



కోదాడ : రైతు భరోసా దీక్షలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

హుజూర్‌నగర్ : పంట ఎండిపోయి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఎకరాకు రూ 25 వేల నష్టపరిహారం అందించాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, బీఆర్‌ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి అన్నారు. శనివారం హుజూర్‌నగర్‌లోని అడ్డ రోడ్డులో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రైతు దీక్ష, నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధరతో పాటు వరి ధాన్యానికి క్వింటాకు రూ.500లు బోనస్ అందించాలన్నారు. ఆత్మహత్య చేసుకుని చనిపోయిన రైతులకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు. వర్షాకాలంలో వానలు పడకపోయినా మూడుసార్లు సాగు నీరు అందించి రైతులను ఆదుకున్నది సీఎం కేసీఆర్ హయంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అని గుర్తుచేశారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పి బీఆర్‌ఎస్ అభ్యర్థులను ఎంపీలుగా గెలిపించాలని వారు కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు అమర్, సీహెచ్.సైదులు, కె.వెంకటరెడ్డి, జె.నాగేశ్వరరావు, జె.వీర్య, నగేష్ రాథోడ్, డి.అప్పిరెడ్డి, ఎ.సురేష్, జగన్‌నాయక్, కేఎల్‌ఎన్‌రెడ్డి, ఐ.పిచ్చయ్య, జయబాబు, ఎం.సత్యనారాయణరెడ్డి, చెవుల కవిత, కృష్ణనాయక్, ఎం.రాంబాబు, ఎస్.బసవయ్య. పి.రామారావు, శ్రీహరి, అబ్దుల్‌నబీ, నర్సింహారావు, శ్రీనివాస్, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హామీలను తుంగలో తొక్కిన ప్రభుత్వం

కోదాడ : అధికారంలోకి వచ్చిన తరువాత రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నాయకులు తుంగలో తొక్కారని, రైతులు కాంగ్రెస్ నాయకుల మాయమాటలను గమనించి పార్లమెంట్ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ కోరారు. శనివారం కోదాడలోని రంగా థియేటర్ సెంటర్‌లో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు భరోసా యాత్రలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత వల్ల సాగునీటిని సక్రమంగా ఇవ్వకపోవడంతో పొలాలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గంధం పాండు, మెదర లలిత, కోలా ఉపేందర్, సంపెట ఉపేందర్, ఉద్దండు, పిట్టల బాగ్యమ్మ, తాళ్లూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సాగర్ నీటితో చెరువులు నింపాలి

నడిగూడెం : సాగర్ నీటితో చెరువులను నింపాలని ఎంపీపీ యాతాకుల జ్యోతి ప్రభుత్వాన్ని కోరారు. శనివారం నడిగూడెం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రస్తుత వేసవిలో గతంలో ఎన్నడూ లేనివిధంగా చెరువులు పూర్తిగా ఎండిపోయి భూగర్భ జలాలు అడుగంటాయన్నారు. దీంతో గ్రామాల్లోని ప్రజలతో పాటు మూగజీవాలకు కూడా తాగు నీటి ఎద్దడి ఏర్పడిందన్నారు.

నిర్లక్ష్యానికి నిలువుటద్దం



నడిగూడెంలో ఊడిన రైతు వేదిక గేట్లు

నడిగూడెం : మండల కేంద్రంలోని ఎన్‌ఎస్పీ కాలనీలో ప్రభుత్వం నిర్మించిన రైతు వేదిక వ్యవసాయ శాఖ అధికారులు, పాలకుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా మారింది. రైతు వేదికకు ఏర్పాటు చేసిన రెండు గేట్లు కొద్ది రోజులకే ఊడిపోయాయి. అలాగే రైతు వేదిక ప్రాంగణం చుట్టూ ఎలాంటి రక్షణ గోడ, పెన్సింగ్ ఏర్పాటు చేయలేదు. దీంతో చీకటైతే అసాంఘిక కార్యకలాపాలకు రైతు వేదిక నిలయంగా మారింది. సంబంధిత అధికారులు స్పందించి ప్రహరీ ఏర్పాటు చేసి, గేటుకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

భవిష్యత్‌లో ఫార్మా రంగానికే అధిక ప్రాధాన్యం

చివ్వెంల : భవిష్యత్‌లో ఫార్మా రంగానికే అధిక ప్రాధాన్యం ఉంటుందని మెడిప్లస్ హెచ్‌ఆర్ తాజోద్దీన్ అన్నారు. శనివారం దురాజ్‌పల్లి గ్రామ శివారులోని ప్రతిష్ఠ ఫార్మసీ కళాశాలలో బి.ఫార్మసీ, డి.ఫార్మసీ, ఫామ్ ×డీ² చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత సంవత్సరం కళాశాలకు న్యాక్ ×ఏ² గ్రేడ్ రావడం అభినందనీయమన్నారు. చదువుకునే రోజుల్లోనే విద్యార్థులు భవిష్యత్‌కు ఉపయోగపడే విద్యను ఎంచుకోవడంతో ఉద్యోగాలను సాధించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల నుంచి 25 మంది విద్యార్థులు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ శివరామక్రిష్ణ, ప్రిన్సిపల్ రాజ్ కుమార్, సెక్రటరీ విజయలక్ష్మి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ మధు, కుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యార్థులకు 'మహా' ప్రోత్సాహకాలు



విద్యార్థులకు నగదు, ప్రశంసాపత్రాలు అందిస్తున్న మైహోం సిమెంట్ పరిశ్రమ ప్రతినిధులు

మేళ్లచెరువు : ప్రభుత్వ పాఠశాలల్లోని మెరిట్ విద్యార్థులకు మైహోం సిమెంట్ పరిశ్రమ యాజమాన్యం ఆధ్వర్యంలో మహా స్కాలర్స్ పేరుతో శనివారం మేళ్లచెరువు మండల కేంద్రంలో నగదు ప్రోత్సాహక బహుమతులు అందించారు. మైహోమ్ గ్రూప్ చైర్మన్ రామేశ్వరరావు పేరు మీద మేళ్లచెరువు, కందిబండ, చింతలపాలెం, రేవూరు, మఠంపల్లి, చౌటపల్లి, రఘునాథపాలెం, తొగర్రాయి, గణపవరం, గుడిబండ, మఠంపల్లి కేజీబీవీ మొత్తం 12 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రథమ బహుమతిగా రూ.8 వేలు, ద్వితీయ బహుమతి రూ.6 వేలు, తృతీయ బహుమతి రూ.4 వేల రూపాయల చొప్పున మొత్తం 36 మంది విద్యార్థులకు రూ.2 లక్షల 16 వేలు అందించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తూ ప్రతిభ చూపుతున్న 8, 9, 10 తరగుతుల విద్యార్థులకు మహా స్కాలర్‌షిప్ పేరుతో మైహోం సిమెంట్ వారు నగదు పురస్కారం అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. పేద విద్యార్థులు చదువును మధ్యలో ఆపివేయకుండా వారు ఇచ్చే నగదు బహుమతి వారికి ఉపయోగపడి వారి జీవితాలను మలుపు తిప్పేందుకు దోహద పడుతుందన్నారు. విద్యార్థులు చదువు ద్వారా ఉన్నత స్థానాలు పొందాలని, తల్లిదండ్రుల ఆకాంక్షలను నేరవేర్చాలని కోరారు. ఉద్యోగ కల్పనతో పాటు సామాజిక సేవ చేస్తున్న మైహోం సిమెంట్స్ ప్రతినిధులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ జాయింట్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, డీజీఎం నాగేశ్వరరావు, అడ్వైజర్ జగన్నాథరావు, ఏజీఎం శ్రీనివాస్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మాదిగలకు ప్రాధాన్యం ఇవ్వకపోవడం అన్యాయం



అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్నా చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కోదాడ : తెలంగాణలో 12 పార్లమెంట్ నియోజకవర్గాల్లో మాదిగ ఓటర్లు ఎక్కువగా ఉన్నప్పటికీ కాంగ్రెస్ పార్టీ మాదిగలకు ఒక్క పార్లమెంట్ సీటు కూడా కేటాయించకపోవడం అన్యాయమని మహజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఏపూరి రాజు అన్నారు. మాదిగలకు కాంగ్రెస్ పార్టీ ఒక్క ఎంపీ సీటు కూడా కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ శనివారం కోదాడలో అంబేద్కర్ విగ్రహం ఎదుట ఎమ్మార్పీఎస్, మహజన సోషలిస్టు పార్టీల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిగలకు ప్రాధాన్యం ఇవ్వకపోవడం దారుణమని, కాంగ్రెస్ పార్టీ ఇప్పటికైనా మాదిగలకు కనీసం రెండు పార్లమెంట్ సీట్లు కేటాయించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వడ్డేపల్లి కోటేష్, యలమర్తి రాము, ఏపూరి సత్యరాజు, కుక్కల కృష్ణ, సూరిబాబు, సూర్యప్రకాశ్, రామారావు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

దేశ భవిష్యత్తును మార్చే ఎన్నికలు

భానుపురి : రానున్న పార్లమెంటు ఎన్నికలు దేశ భవిష్యత్తును మార్చనున్నాయని తెలంగాణ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన నివాసంలో 35వ వార్డు కౌన్సిలర్ జ్యోతి కరుణాకర్ ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇచ్చిన ప్రతి హామీని తక్కువ సమయంలోనే అమలు చేసిన చరిత్ర కాంగ్రెస్‌దే ఆయన అన్నారు. 35వ వార్డు చర్చి కాంపౌండ్ ప్రాంతాన్ని దత్తత తీసుకొని ప్రజల సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. అనంతరం తుక్కుగూడలో జరిగిన బహిరంగ సభకు భారీగా తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు షఫీఉల్లా, చిలుముల గోపాల్‌రెడ్డి, నేరేళ్ల వెంకన్న, శ్రీనివాస్‌గౌడ్, రమేష్‌నాయుడు, సంజయ్, సైదులు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.